క్లుప్తంగా

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



ఉసులుమర్రు సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ అచ్యుత కుమారి

పెరవలి: ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ డి.అచ్యుత కుమారి తెలిపారు. పెరవలి మండలం ఉసులుమర్రులో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట భూముల సమస్యలున్న రైతులు తమకు తెలియజేస్తే వాటిని సరిచేస్తామన్నారు. అనంతరం భూ సమస్యలపై 6 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పావని, సర్పంచ్ వీరమళ్ళు విజయలక్ష్మి, ఎంపీటీసీ, దేవస్థానం అధికారులు, సర్వేయర్లు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఉండ్రాజవరం: మోర్త సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ వేలివెన్ను ఫీడర్, 11 కేవీ చిలకపాడు ఫీడర్‌లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు గురువారం తెలిపారు. వ్యవసాయ బోర్లకు ప్రత్యేక 11 కేవీ ఫీడర్ వేసే పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వ్యవసాయ వినియోగదారులు సహకరించాలన్నారు. అలాగే మోర్త గ్రామానికి కూడా సరఫరా ఉండదన్నారు.

దేవరపల్లి: యర్నగూడెం 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. యర్నగూడెం, త్యాజంపూడి, గాంధీనగరం, సంగాయగూడెం గ్రామాల్లో గృహ వినియోగదారులతో పాటు ఇండస్ట్రియల్, వ్యవసాయ వినియోగదారులకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు వివరించారు. వ్యవసాయానికి ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకూ, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా ఉంటుందన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని వినతి

చాగల్లు: తొలగించిన హెల్త్ అసిస్టెంట్లను తక్షణమే తిరిగి విధుల్లోకి తీసుకోవాలను బ్రాహ్మణగూడెంలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకి గురువారం వినతి పత్రం అందించారు. హెల్త్ అసిస్టెంట్ ఎం.రాజశేఖర్, డీవీ రామకృష్ణ మాట్లాడుతూ విధుల నుంచి తొలగించడంతో కొవ్వూరు నియోజకవర్గంలో పని చేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు సుమారు 17 మంది భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైందన్నారు. తక్షణమే వారిని విధుల్లోకి తీసుకొని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ బృందమంతా గత సోమవారం రాజధాని అమరావతిలో ఉన్న టీడీపీ ప్రధాన కార్యాలయంలో ప్రజా దర్బారులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి గోడు విన్నవించుకున్నారన్నారు. అలాగే హెల్త్ వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి కృష్ణబాబుతో కూడా ఈ సమస్యను చెప్పుకొన్నారన్నారు.

రేపు మున్సిపల్ సమావేశం

కొవ్వూరు: స్థానిక పురపాలక సంఘం సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు చైర్ పర్సన్ బావన రత్నకుమారి తెలిపారు. పట్టణంలో చేపట్టే వివిధ అభివృద్ధి అంశాలపై చర్చించనున్నట్టు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

కొవ్వూరు: పట్టణంలోని టోల్‌గేట్ జంక్షన్ సమీపంలో ఉన్న ఎరినమ్మ ఆలయ పునర్నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. టీడీపీ దిసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ,మాజీ మునిసిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, నాయకులు సూర్యదేవర రంజిత్, దాయన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తిదారులకు శిక్షణ

నిడదవోలు: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో నిడదవోలు పురపాలక సంఘం పరిధిలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న చేతి వృత్తిదారులకు నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్లంబర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ, గ్రీజర్, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్, వాటర్ ప్యూరిఫైర్ల మరమ్మతులు చేసే కార్మికులతో పాటు బ్యూటీషియన్ (పురుషులు, మహిళలు)లకు శిక్షణ ఇవ్వనున్నారు. 15 రోజుల శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందించనున్నారు. అలాగే హోమ్ ట్రియాంగిల్ ప్లాట్‌ఫారం ద్వారా జీవనోపాధి పొందుతారని కమిషనర్ కృష్ణవేణి తెలిపారు. రేషన్, ఆధార్‌కార్డులు, బ్యాంకు పాస్‌బుక్, పాన్‌కార్డు జిరాక్స్ కాపీలు జత చేసిన దరఖాస్తులను ఈ నెల 27 నుంచి 30 తేదీ వరకూ స్థానిక మెప్మా కార్యాలయంలో అందించాలని కోరారు. వివరాలకు 80746 63920, 80746 70013, 79016 10130 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపు ఐఐహెచ్ఆర్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ రాక

కొవ్వూరు: అఖిల భారత పండ్ల పరిశోధన సమన్వయ పథకం (ఐఐహెచ్ఆర్) బెంగళూరు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రకాష్ పటేష్ స్థానిక వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానాన్ని శనివారం సాయంత్రం 3 గంటలకు సందర్శించనున్నారు. పరిశోధన స్థానం ముఖ్య శాస్త్రవేత్త పి.లలితా కామేశ్వరి గురువారం ఈ విషయం తెలిపారు.

చెత్తగించండి సారూ..

- పారిశుధ్య కార్మికులకు కానరాని రక్షణ కవచాలు
- మురుగు, చెత్తలోనే పనులు
- కనీస సామగ్రి లేక ఇబ్బందులు



నల్లజర్లలో ట్రాక్టర్‌పై చెత్త తీసుకెళ్తున్న పారిశుధ్య కార్మికులు



నల్లజర్లలో రిక్షాపై చెత్త తరలిస్తున్న పారిశుధ్య కార్మికుడు

నల్లజర్ల: ఊళ్లో చెత్తను తీసి.. కాలువల్లో వ్యర్థాలు తొలగించి.. రహదారులను తీర్చిదిద్ది అంతా శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులకు రక్షణ లేకుండా పోయింది. మురుగు నీరు, చెత్త, దుమ్ము, ధూళితో సహజీవనం చేసే కార్మికులకు ఆరోగ్య భద్రత కరవైంది. వారికి కనీస సదుపాయాలు లేక ఈ పరిస్థితి దాపురించింది. చేతులు, కాళ్లు, నోటికి రక్షణ కవచాలు లేకుండానే మురికి కూపాల్లోకి దిగి పని చేయాల్సి వస్తోంది. కలుషిత గాలి పీల్చడం, పూడికలను చేతులతో తీయడం వల్ల వారికి అనేక అంటురోగాలు వ్యాపిస్తున్నాయి. అయినా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం శోచనీయం. నల్లజర్ల మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా పంచాయతీల్లో 125 మంది వరకూ ప్రైవేట్ పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. మేజర్ పంచాయతీల్లో పది నుంచి 20 మంది, మైనర్ పంచాయతీల్లో నలుగురు చొప్పున పని చేస్తున్నారు. వీరు రోజుకు టన్నుల కొద్దీ చెత్తను ఊరి బయటకు తరలిస్తున్నారు. దీనిని తరలించడానికి మేజర్ పంచాయతీల్లో ట్రాక్టర్లు, మైనర్ పంచాయతీల్లో రిక్షాలు, ఆటోలు వినియోగిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ చెత్తను తొలగించి గ్రామాలను శుభ్రంగా ఉంచే పనిలో నిర్విరామంగానే వీరు పని చేస్తున్నారు. వీరు ఒకటి రెండు రోజులు సెలవు పెడితే ఎక్కడ చెత్త అక్కడ రోడ్లపైనే ఉంటుంది. అందుకే వీరు గ్రామాల్లో కీలక భూమిక మారారు. అలాంటి కార్మికుల ఆరోగ్య రక్షణపై శ్రద్ధ కొరవడుతోంది.

అందించాల్సిన సామగ్రి

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం శాశ్వత పారిశుధ్య కార్మికులు కాకపోయినా నెలకు 350 మిల్లీలీటర్ల కొబ్బరి నూనె, డిటర్జెంట్ సబ్బు, ఆరు నెలలకు ఒకసారి తువ్వాలు, మాస్క్, చేతులకు గ్లౌజ్‌లు, పాదరక్షలు ఉచితంగా అందించాలి. రెండు జతల యూనిఫాం, మహిళలకు రెండు చీరలు ఇవ్వాలి. కొన్నిచోట్ల వీటిని అరకొరగా అందిస్తున్నారు. మరికొన్ని చోట్ల అసలు ఇవ్వడం లేదని కార్మికులు చెబుతున్నారు. రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు.

కాళ్లలో పెంకులు దిగుతున్నాయి



నల్లజర్లలో ఐదేళ్లుగా పనిచేస్తున్నాను. పర్మినెంట్ అయ్యే అవకాశం కనబడడం లేదు. కొంతమందికి రూ.9 వేలు, మరి కొంతమందికి రూ.12 వేల వరకూ వేతనం వస్తోంది. చాలా సందర్భాల్లో పనిచేసే చోట గాజు పెంకులు కాళ్లలోకి దిగుతున్నాయి. దీనికి ప్రత్యేకమైన చెప్పులు అందిస్తే బాగుంటుంది. వేతనాలు పెంచాలి.

–ఫకీరు, పారిశుధ్య కార్మికుడు, నల్లజర్ల

రోగాల బారిన పడుతున్నాం



మురుగు కాలువల్లో పని చేసేటప్పుడు ఇబ్బందికరంగా ఉన్నా తప్పనిసరి పరిస్థితుల్లో పని చేయాల్సి వస్తోంది. మురుగునీటిలో పని చేయడం వల్ల రోగాల బారిన పడుతున్నాం. ఆదివారం కూడా సగం రోజు పని చేయిస్తున్నారు.

–వెంకటస్వామి.పారిశుధ్య కార్మికుడు, నల్లజర్ల

సామగ్రి అందిస్తున్నాం



పారిశుధ్య కార్మికులకు అందించే వాటిలో మాస్కులు, గ్లౌజులు, పాదరక్షలు, కొబ్బరి నూనె, యూనిఫామ్, యాప్రాన్ అందిస్తున్నాం. కార్మికులు ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని పంచాయతీల్లో బీమా పథకాలు కూడా అమలు చేస్తున్నాం.

–సింహాద్రి, ఈఓపీఆర్డీ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, నల్లజర్ల

విప్లవ పార్టీలన్నీ ఐక్యం కావాలి



కొవ్వూరులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమన్నారాయణ

కొవ్వూరు: ప్రజా హక్కుల కోసం పోరాటం చేసే విప్లవ పార్టీలన్నీ రానున్న రోజుల్లో ఐక్యం కావాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ కోరారు. ఈ నెల 28వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే సీపీఐ ఎంఎల్, న్యూ డెమొక్రసీ పార్టీల విలీనం పోస్టర్‌ను గురువారం ఆయన కొవ్వూరులో ఆవిష్కరించారు. దేశంలో కార్పొరేట్ సర్పం పడగ విప్పి ప్రజలపై బుసలు కొడుతున్న వేళ బడుగు, బలహీన వర్గాలు, శ్రామిక శక్తులన్నీ ఏకంగా కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సహాయ కార్యదర్శి ఈమని మల్లిక పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే లక్ష్యం

కొవ్వూరు: విద్యార్థులకు చదువుతో పాటు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశామని ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.రామ్మోహనరావు అన్నారు. గురువారం కళాశాలలో దివీస్ లేబోరేటరీస్ ఆధ్వర్యంలో బీఎస్సీ, ఎమ్మెస్సీ, బీఫార్మసీ, ఎమ్ ఫార్మసీ చదివిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. దివీస్ హెచ్‌ఆర్ ప్రతినిధులు అప్పసాని రాజేష్, పోతు రామకృష్ణల పర్యవేక్షణలో ఇంటర్వ్యూలు జరిగాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలతో పాటు అల్లూరి సీతా రామరాజుమన్యం జిల్లా నుంచి 54 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరైనట్లు కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి కె.సూరిబాబు తెలిపారు.

కంపోస్ట్ ఎరువు తయారీకి చర్యలు చేపట్టాలి



దమ్మెన్నులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రకాష్

ఉండ్రాజవరం: గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా ఎరువుల తయారీకి పంచాయతీలు చర్యలు చేపట్టాలని శానిటరీ మండల కో ఆర్డినేటర్ కత్తుల ప్రకాష్ సూచించారు. మండలంలోని దమ్మెన్నుతో పాటు పలు గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించి, దానిని తడి, పొడి చెత్తలుగా వేరు చేసి పొడి చెత్తను విక్రయించాలన్నారు. తడి చెత్త నుంచి వర్మికంపోస్ట్ పిట్‌ల ద్వారా కంపోస్ట్ తయారు చేయాలన్నారు. ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగం కాకుండా సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. తద్వారా గ్రామాల్లో సంపద సృష్టించాలన్నారు.

బాధితులకు మాజీ ఎమ్మెల్యే తలారి పరామర్శ



పైడిమెట్టలో వీరమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

తాళ్లపూడి: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ తలారి వెంకట్రావు గురువారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. పైడిమెట్ట గ్రామానికి చెందిన జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షుడు దున్న దుర్గారావు తల్లి వీరమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో పార్టీ నాయకులతో కలిసి దుర్గారావు ఇంటికి వెళ్లారు. వీరమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం బల్లిపాడులో వైఎస్సార్ సీపీ నాయకుడు కొయ్యే దుర్గారావు తండ్రి అగ్గిరాముడు వర్ధంతిలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు యాళ్ల బాబూరావు, దుర్గారావు, కవల నాగేశ్వరరావు, గుంటు చిన్నబ్బాయి, దాకే రాజు, చిక్కాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి వనిత పరామర్శ



చక్రవర్తి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత

దేవరపల్లి: ఇటీవల యర్నగూడెంలో తిరుపతి చక్రవర్తి గుండెపోటుతో మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులను రాష్ట్ర మాజీ హోం మంత్రి, గోపాలపురం నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత గురువారం పరామర్శించారు. చక్రవర్తి కుటుంబంతో తనకు ఉన్న అనుబంధాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

పోలీసులకు రివార్డులు



గోపాలపురంలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహకిషోర్

గోపాలపురం: దొండపూడి పంచాయతీ పరిధి సాగిపాడు గ్రామంలో ఇటీవల జరిగిన దొంగతనం కేసును త్వరితగతిన ఛేదించిన సిబ్బందికి రివార్డులు ప్రకటిస్తున్నట్లు జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ తెలిపారు. గురువారం గోపాలపురం పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు, పేకాట, గుండాట వంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదే విధంగా డిసెంబర్ 31 రాత్రి ప్రజలకు ఇబ్బందులు కల్గిస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఆయన వెంట దేవరపల్లి సీఐ బి.నాగేశ్వర్ నాయక్, ఎస్సై కర్రి సతీష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నేడు నిరసన



తానేటి వనిత, నియోజకవర్గ సమన్వయకర్త

దేవరపల్లి: విద్యుత్ చార్జీల పెంపుపై శుక్రవారం గోపాలపురంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన నిరసన ప్రదర్శన, విద్యుత్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి, గోపాలపురం నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు స్థానిక చెక్‌పోస్టు వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడి నుంచి నిరసన ప్రదర్శనగా విద్యుత్ అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్ కార్యాలయానికి చేరుకుని ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనంతరం ఏడీఈకి వినతి పత్రం అందజేస్తామని ఆమె వివరించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నిడదవోలులో..

నిడదవోలు: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు నిడదవోలు విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ తలపెట్టిన నిరసనను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు పిలుపునిచ్చారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ విద్యుత్ అధికారులకు వినతిపత్రం సమర్పించాలన్నారు. ముందుగా పట్టణంలోని వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి చాగల్లు రోడ్డులో ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయం వరకూ చేరుకుంటారన్నారు. అక్కడ నిరసన తెలపనున్నారు. దీనికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ హాజరు కానున్నారు.



కొవ్వూరులో విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నాయకులు

పోరుబాట బాటకు సన్నద్ధంకండి

కొవ్వూరు: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా శుక్రవారం ఉదయం కొవ్వూరులో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. గురువారం కొవ్వూరులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహ వినియోగదారులపై కూటమి ప్రభుత్వ మూడు విడతల్లో రూ.15,485.36 కోట్ల భారం మోపిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం పెంచిన కరెంట్ చార్జీలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే ఉచిత విద్యుత్ సదుపాయాన్ని ఎత్తివేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా శుక్రవారం విజయవిహార్ సెంటర్ నుంచి విద్యుత్ శాఖ ఏడీఈ కార్యాలయం వరకూ భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యే ఈ నిరసన ర్యాలీకి నియోజకవర్గంలో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు విద్యుత్ వినియోగదారులు తరలిరావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కరెంట్ చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట పోస్టర్‌ను వెంకట్రావు ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, చాగల్లు ఎంపీపీ మాట్టా వీరాస్వామి, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, కాకర్ల వెంకటేశ్వరరావు, చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు తోట రామకృష్ణ, నాయకులు ఉప్పులూరి సూరిబాబు, కంఠమణి రమేష్ పాల్గొన్నారు.

పరిష్కారం చూపని సదస్సులెందుకు!

రెవెన్యూ సదస్సులో రైతుల ఆగ్రహం



చీపురుగూడెం రెవెన్యూ సదస్సులో అర్జీ అందజేస్తున్న రైతులు

నల్లజర్ల: సమస్యలకు పరిష్కారం చూపని రెవెన్యూ సదస్సులు ఎందుకంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం చీపురుగూడెంలో తహసీల్దార్ ఎస్‌వీకే నాయుడు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. సమస్యలు ఉన్న వారు తగిన ఆధారాలతో అర్జీలు ఇవ్వాలని అధికారులు కోరడంతో కొంతమంది రైతులు ముందుకు వచ్చారు. తమ గ్రామంలో రీ సర్వే పూర్తయ్యిందని, భూ విస్తీర్ణం తగ్గడం, పెరగడం కనిపించిందన్నారు. వీటిని సరిచేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని, ఇప్పుడు వచ్చి భూ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ రైతులను సముదాయించారు. రైతులు చెల్లు పెదరామన్న, కూసంపూడి వెంకటేశ్వరరావు, కంపన దుర్గారావు, చెల్లు సత్యనారాయణ, వీరవెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రైతులు పది అర్జీలు అందించారని వీఆర్వో సునీత తెలిపారు.

గత ఫిర్యాదులకు పరిష్కారం ఏదీ?

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం గ్రామ పంచాయతీ పరిధిలోని రావులపాడులో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దేవం ఉప సర్పంచ్ తోట రామకృష్ణ మాట్లాడుతూ గతంలో జగనన్న భూ సర్వేలో చాలా మంది రైతులు తమ భూ సమస్యలపై చేసిన ఫిర్యాదులను నేటికీ పరిష్కరించలేదన్నారు. అబద్ధపు హామీలతో పాటు తాము అధికారంలోకి వస్తే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇంకా జగనన్న ప్రవేశపెట్టిన భూ సర్వేనే కొనసాగిస్తుందని అధికారులు చెబుతున్నట్టు తెలిపారు. తమకు తగు న్యాయం చేసి ఎవరి పాస్ బుక్‌లు వాళ్లకి వచ్చేలా చూడాలని రైతులు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ తిగిరి పల్లి వెంకట్రావు, ఆర్ఐ కె.రామకృష్ణ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రైతులే దేశానికి వెన్నెముక

కొవ్వూరు: రైతు దేశానికి వెన్నెముక అని, రైతుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కుమారదేవం గ్రామంలో గురువారం పంపింగ్ స్కీమ్ రైతు సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 1998 నుంచి పంపింగ్ స్కీమ్‌ను సమర్థవంతంగా నడిపించుకోవడం అభినందనీయం అన్నారు. రైతుల సమస్యలపై ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవలన్నారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో ఎత్తిపోతల పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ(నారాయుడు), మండల టీడీపీ అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వర రావు, మున్సిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, నాయకులు సూర్యదేవర రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

కుమారదేవం ఎత్తిపోతల పథకం అధ్యక్షుడిగా సురేష్

కుమారదేవం ఎత్తిపోతల పథకం రైతు సంఘం అధ్యక్షుడిగా గోరిజాల సురేష్, ఉపాధ్యక్షుడు యనమదల శివరామకృష్ణ, కార్యదర్శిగా గారపాటి వీరవెంకట సత్యనారాయణ ప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా గోరిజాల గంగధరరావు, ఇంటి వీర వెంకట రామచంద్రరావు, కారింకి వీరబ్రహ్మం, మన్నెల్లి వెంకట రమణ, చావా వెంకటకృష్ణ రామారావు, మారిశెట్టి రామ సుబ్రహ్మణ్యం, జుజ్జవరపు నాగేశ్వరరావు, మద్దిపట్ల వెంకట్రావులు ఎన్నికయ్యారు. వీరిని సంఘ సభ్యులు, నాయకులు ఘనంగా పూలమాలలతో సత్కరించారు.

మోహన్‌రంగా సేవలు స్ఫూర్తిదాయకం



అనంతపల్లిలో మోహన్‌రంగా, శ్రీకృష్ణదేవరాయులు విగ్రహావిష్కరణలో నాయకులు



దేవరపల్లిలో వంగవీటి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ దుర్గారావు

నల్లజర్ల: కాపు ఉద్యమ నేత వంగవీటి మోహన్‌రంగా సేవలు అందరికీ స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మోహన్‌రంగా వర్ధంతి సందర్భంగా నల్లజర్ల మండలం అనంతపల్లిలో కాపు సంఘం, రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో మోహన్‌రంగా, శ్రీకృష్ణదేవరాయుల విగ్రహాలను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర కాపు సంఘ నాయకులు కరాటం రాంబాబు మోహన్‌రంగా విగ్రహాన్ని ఆవిష్కరించగా, శ్రీకృష్ణదేవరాయుల విగ్రహాన్ని ముద్రగడ కుమార్తె బార్లపూడి క్రాంతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కరాటం మాట్లాడుతూ రంగా మన మధ్య లేకపోయినా పేదలంతా ఆయన్ని దైవంగా భావిస్తున్నారన్నారు. కాపు సోదరులంతా ముందు ఆర్థికంగా స్థిరపడాలని ఆ తర్వాతే రాజకీయాల వైపు వెళ్లాలని సూచించారు. అనంతరం 3 వేల మందికి భోజన ఏర్పాట్లు చేశారు. మాజీ మంత్రి తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, పుప్పాల వాసుబాబు, వడ్డి రఘురాంనాయుడు, ఆడపా నాగేంద్ర, దొడ్డిగర్ల సువర్ణరాజు, ఎంపీపీ బంక జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెల్లంకి వెంకటసుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యులు వామిశెట్టి పావనీకుమారి, పరమేశ్వరరావు, యడ్లపల్లి మార్త, ఆర్లెళ్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి రంగాకు ఘన నివాళి

దేవరపల్లి: కాపు ఉద్యమనేత దివంగత వంగవీటి మోహనరంగా 36వ జయంతిని దేవరపల్లి మండలంలో వైఎస్సార్ సీపీ, కాపు సంఘ నాయకులు, జనసేన శ్రేణులు వేర్వేరుగా నిర్వహించారు. దేవరపల్లి మూడు బొమ్మల సెంటర్లోని మోహన్‌రంగా విగ్రహానికి ఎంపీపీ కేవీకే దుర్గారావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు కవల శ్రీను పూలమాలలు వేశారు. అలాగే దేవరపల్లి, యర్నగూడెంలో బస్టాండ్ వద్ద గల వంగవీటి మోహన్‌రంగా విగ్రహానికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డి.సువర్ణరాజు నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, పచ్చా రాంగోపాల్, కామిశెట్టి దుర్గారావు, కాపు సంఘం నాయకులు మాధవరపు వెంకటేశ్వరరావు, పసుపులేటి ప్రసాద్ పాల్గొన్నారు.

ఉండ్రాజవరం మండలంలో..

ఉండ్రాజవరం: మండలంలో పలు గ్రామాల్లో వంగవీటి మోహనరంగా వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. చివటంలో శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం ఆధ్వర్యంలో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ప్రాథమిక పాఠశాల నంబర్ 1, 2తో పాటు అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు బిస్కెట్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాసరి మునిరాజు, అబ్బిరెడ్డి శివ, గంటిన చిన వెంకన్న, కూనపరెడ్డి అంజి, కూనపరెడ్డి ప్రసాద్, కర్రి జగపతి, పంజా శ్రీను, సంఘం సభ్యులు పాల్గొన్నారు. తాడిపర్రులో శివాలయం సెంటర్ వద్ద రంగా విగ్రహానికి గ్రామ కాపు యువకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.